క్లుప్తంగా

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

రామారెడ్డి(ఎల్లారెడ్డి): పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దశరథ్‌రెడ్డి కోరారు. సోమవారం పోసానిపేటలో పశువైద్య శిబిరాన్ని సర్పంచ్ మహేందర్ రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. రామారెడ్డి పశువైద్యాధికారి రమేష్ పాల్గొన్నారు.
దోమకొండ: ముత్యంపేటలో పశువైద్య శిబిరాన్ని స్థానిక జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మూర్తి, సింగిల్ విండో చైర్మన్ తిరుపతిగౌడ్, సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, మండల పశువైద్యాధికారి శివ, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో పేదల జీవితాల్లో వెలుగు

పిట్లం(జుక్కల్): సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన కంటి వెలుగు నిరుపేదల జీవితాల్లో వెలుగును నింపుతోందని సర్పంచ్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆయన అల్లాపూర్‌లో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ నవీన్ కుమార్ పాల్గొన్నారు.
నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జలాల్‌పూర్‌లో కంటివెలుగు కార్యక్రమాన్ని సోమవారం స్థానిక ఎంపీడీవో రఘు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంతమంది గ్రామస్తులు కంటిపరీక్షలు చేయించుకున్నారని పంచాయితీ కార్యదర్శి మల్లికార్జున్‌ను ఆయన అడిగి వివరాలు తెలుసుకున్నారు.

జాతిపితకు ఘన నివాళి

దోమకొండ/భిక్కనూరు/నస్రుల్లాబాద్/కామారెడ్డి రూరల్: భారత జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాలు జిల్లాలో పలుచోట్ల సోమవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. భారత స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు కొనియాడారు.

'ఏసీడీ' తగ్గించకపోతే ఉద్యమమే

భిక్కనూరు: ఏసీడీ చార్జీలను వెంటనే తగ్గించాలని లేకుంటే పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన భిక్కనూరులో మాట్లాడుతూ..ప్రభుత్వాలు కొత్త విధానాలతో ప్రజలపై పన్నుల భారం మోపుతున్నాయని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

గడప గడపకు బీజేపీ

మద్నూర్(జుక్కల్): తడి హిప్పర్గాలో సోమవారం గడప గడపకు బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే అరుణతార, చుట్టు పక్కల గ్రామాల నేతలు పాల్గొని మాట్లాడారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వ పాలనతో ప్రపంచ దేశాలు సైతం మన దేశాల వైపు చూస్తున్నాయన్నారు. అగ్రదేశాల అధ్యక్షులు సైతం బీజేపీ పాలనతో పాటు మోదీ అవలంభిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు చూసి అభినందిస్తున్నాయని పేర్కొన్నారు.

సృజన్‌రెడ్డికి ఉత్తమ వైద్య సేవారత్న అవార్డు

కామారెడ్డి అర్బన్: పట్టణానికి చెందిన ఫిజియో థెరపిస్టు సృజన్‌రెడ్డికి ఉత్తమ వైద్యసేవారత్న అవార్డు దక్కింది. హైదరాబాద్ ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ మండలి కృష్ణారెడ్డి ఈ అవార్డు అందజేశారు. విశ్రాంత డీజీపీ గోపీనాథ్‌రెడ్డి, విశ్రాంత న్యాయమూర్తి చంద్రయ్య పాల్గొన్నారు.

దైవభక్తి అలవర్చుకోవాలి

బిచ్కుంద(జుక్కల్): చెడు వ్యసనాలకు దూరంగా ఉండి దైవభక్తి పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే గంగారాం అన్నారు. సోమవారం శివ స్వాముల సన్నిదానంలో ఏర్పాటు చేసిన భిక్ష అన్నదానంలో ఆయన పాల్గొన్నారు. గురుస్వామి సంజీవ్ పాల్గొన్నారు.

ఆట వస్తువుల వితరణ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం కామారెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఇప్పకాయల రమేష్ రూ.11వేల విలువైన ఆటవస్తువులను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు లక్ష్మీనర్సింలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేంద్ర ప్రసాద్, క్లబ్ సభ్యులు సత్యం, గంగారెడ్డి, భాస్కర్, జైపాల్ రెడ్డి, పీఈటీ బాలు పాల్గొన్నారు.

రాస్తారోకో

బాన్సువాడ టౌన్: బాన్సువాడ ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్‌పై బీజేపీ నేత మాల్యాద్రిరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద దళిత ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. మాల్యాద్రిరెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అమరవీరుల దినోత్సవం

బాన్సువాడ రూరల్: శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సోమవారం జాతీయ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపల్ గంగాధర్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు కాసేపు మౌనం పాటించారు. జాతీయోద్యమంలో సేవలందించిన వారిని స్మరించుకున్నారు. వైస్ ప్రిన్సిపల్ ముస్తఫా, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

- ప్రోత్సహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక
- జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు


బస్వాపూర్‌లో..


నస్రుల్లాబాద్: సంగంలో బాల్య వివాహాలను అరికడదామని ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు


లింగాపూర్ ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సాక్షి, నెట్‌వర్క్ : బాల్య వివాహాలను అరికట్టాలనే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అధికారులు సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించారు. బాల్య వివాహాల వల్ల జరిగే ప్రమాదాల గురించి, ఆరోగ్య సమస్యల గురించి అవగాహన కల్పించారు. ఆడ పిల్లలకు 18 ఏళ్లు, మగ పిల్లలకు 21 ఏళ్లు వచ్చిన తర్వాతనే పెళ్లిళ్లు చేయాలని అధికారులు సూచించారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే తీవ్రమైన చర్యలుంటాయని హెచ్చరించారు. మీ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు అనుమానం వస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. 100కు డయల్ చేస్తే మీకు సహకరిస్తారని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.


గొడ్మగాంలో మాట్లాడుతున్న కార్యదర్శి శ్రీలత


దౌల్తాపూర్‌లో .. పాఠశాల హెచ్‌ఎం శోభారాణి


పెద్దకొడప్‌గల్‌లో.. సర్పంచ్ తిర్మల్ రెడ్డి


కామారెడ్డి అర్బన్: గొల్లవాడలో పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత


భిక్కనూరులో ..


దోమకొండలో ..


గోపాల్‌పేటలో ర్యాలీ ..

'భగీరథ నీరు శుభ్రంగా రావడం లేదు'


అధికారులను ప్రశ్నిస్తున్న బీర్కూర్ ఎంపీపీ రఘు

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మండల కేంద్రంలో సోమవారం ఎంపీపీ రఘు అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం సాదా సీదాగా జరిగింది. ఉదయం 11 గంటలకు జరగాల్సిన సమావేశం అధికారులు, ప్రజాప్రతినిధుల రాకపోవడంతో ఆలస్యంగా ప్రారంభమైంది. మండలంలోని ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు శుభ్రంగా రావడం లేదని సంబంధిత అధికారులపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరుగుతుందని ప్రజాప్రతినిధులు వాగ్వాదానికి దిగారు. వివిధ శాఖల అధికారులు నివేదికలను చదివి వినిపించారు. తహసీల్దార్ రాజు, ఎంపీడీవో భాను ప్రసాద్ పాల్గొన్నారు.

పంటల పరిశీలన

మద్నూర్(జుక్కల్): పెద్ద తడ్గూర్‌లో సోమవారం కుసుమ, శనగ, జొన్న, మొక్క జొన్న, సోయాబీన్, ధనియా పంటలను ఏరువాక కేంద్రం, మాల్తుమ్మెద శాస్త్రవేత్త రేవంత్ నాథన్, విస్తరణాధికారి చిద్రవార్ సతీష్ పరిశీలించారు. తెగుళ్లను గమనించి నివారణకు సలహాలు, సూచనలు ఇచ్చారు.
బీబీపేట: యాడారంలో వరి పొలాలను ఏఈవో లత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరిలో మొగి పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు ఆమె గుర్తించారు. మొగి పురుగు నివారణకు సలహాలు, సూచనలు ఇచ్చారు. అమృతారెడ్డి, సత్యం ఉన్నారు.

కబ్జాకు గురైన స్థలాల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..

బాన్సువాడ టౌన్: మున్సిపాలిటీ పరిధిలో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, కమిషనర్ రమేష్‌లు అన్నారు. ఈ నెల 28న సాక్షి పత్రికలో వచ్చిన 'ప్రభుత్వ స్థలాలు కన్పిస్తే కబ్జా' అనే కథనానికి వారు స్పందించి మున్సిపాలిటీ స్థలాలను పరిశీలించారు. మున్సిపల్‌కు సంబంధించిన స్థలాలకు బోర్డులు ఏర్పాటు చేయాలని, చుట్టూ కంచెలు వేయాలని సూచించారు. కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామన్నారు. స్థలాలు పరిశీలించిన వారిలో కౌన్సిలర్లు బాడి శ్రీనివాస్, అమెర్, నార్ల ఉదయ్ తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



మాచారెడ్డి: ఎయిడ్స్ మహమ్మారిని నిర్మూలించడానికి కళాజాత ప్రతినిధులు గ్రామ గ్రామాన పాటలు పాడుతూ గ్రామస్తులను చైతన్యం చేస్తున్నారు. భవానిపేటలో సోమవారం కళాజాత ప్రతినిధులు పాడిన పాటలు చైతన్యం చేశాయి. ఎయిడ్స్ బారిన పడితే ఎలాంటి ఇబ్బందులు ఎదురౌతాయో తెలిపే నాటికను ప్రదర్శించారు. గ్రామ సర్పంచ్ మద్దెల రాజు, ఉప సర్పంచ్ రమేష్ గౌడ్, కళాకారులు డప్పు సాయిలు, నాగరాణి, అంజలి ఉన్నారు.

ఇరవై ఏళ్లలో జరగని అభివృద్ధి చేశా..!

- బహిరంగ చర్చకు సిద్ధం
- ప్రతిపక్షాలకు ఎమ్మెల్యే జాజాల సవాల్


లింగంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల


ఎల్లారెడ్డిలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

లింగంపేట/ఎల్లారెడ్డి: ఇరవై ఏళ్లలో జరగని అభివృద్ధిని ఎల్లారెడ్డి నియోజకవర్గంలో నాలుగేళ్లలో చేశానని ఎమ్మెల్యే జాజాల సురేందర్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన లింగంపేట మండల కేంద్రం, ఎల్లారెడ్డి పట్టణంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గతంలో ఏ నాయకుడు చేయని విధంగా కేవలం రోడ్లు వేయడానికే రూ.50 కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదు అనే బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు సవాలు విసిరారు. అభివృద్ధి విషయంలో పార్టీలకతీతంగా చర్చకు సిద్ధమన్నారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామం, తండాలలో సీసీ రోడ్లు, మురికి కాల్వలు నిర్మించామన్నారు. భూముల సమస్యలు సైతం త్వరలో పరిష్కరిస్తామన్నారు. వరి సాగులో, కొనుగోళ్లలో జిల్లాలోనే లింగంపేట మండలం టాప్‌గా నిలిచిందన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తున్నామన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా తెలంగాణలో అమలవుతున్న పథకాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు రావాల్సిన నిధులు ఇవ్వ డం లేదన్నారు. ప్రతి పక్షాల ఆరోపణలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. లింగంపేట మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, ప్రతీ లబ్ధిదారురాలికి పట్టు చీర అందజేశారు. అలాగే సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇచ్చారు. ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సత్తవ్వకు రూ.3 లక్షల ఎల్‌వోసీ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. లింగంపేట ఎంపీపీ గరీబున్నిసాబేగం, జడ్పీటీసీ శ్రీలత, సర్పంచ్ బొల్లు లావణ్య, ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీపీ మాధవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలను ఎండగడతాం

- కాంగ్రెస్ నేత వడ్డేపల్లి సుభాష్ రెడ్డి


అడ్లూర్ ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న సుభాష్ రెడ్డి

సదాశివ నగర్(ఎల్లారెడ్డి): బీఆర్ఎస్, బీజేపీలను ఎండగట్టడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్ రెడ్డి అన్నారు. సోమవారం అడ్లూర్ ఎల్లారెడ్డి, కుప్రియాల్, మల్లుపేట్ గ్రామాల్లో హాత్ సే హాత్ కార్యక్రమంలో భాగంగా గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించారు. తిర్మన్‌పల్లి సర్పంచ్ బాల్ రెడ్డి పాల్గొన్నారు.

మానవత్వం చాటిన వడ్డేపల్లి

ఎల్లారెడ్డి: సుభాష్‌రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ శివారులో సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన రాజమణి, తన భర్తతో కలిసి బైక్‌పై గాంధారి మండలం పేట్‌సంగెంకు వెళ్తుండగా గుంతలో పడి తీవ్రంగా గాయపడింది. అటువైపుగా వెళ్తున్న సుభాష్‌రెడ్డి తన కారులో రాజమణిని లింగంపేట ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి మానవత్వాన్ని చాటుకున్నారు. లింగంపేట- ఎల్లారెడ్డి రహదారిపై దర్గా వద్ద రోడ్డు ప్రమాదకరంగా మారిందని ఈ విషయమై ఆర్అండ్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

డబుల్ ఇళ్ల కోసం తహసీల్దార్‌కు వినతి


వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

బాన్సువాడ టౌన్: డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కొత్త కొండ భాస్కర్ మాట్లాడుతూ.. తాడ్కోల్ శివారులో ఇటీవల పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూం ఇళ్లు అనర్హులకు ఇచ్చారని, అర్హులైన వారందరికి డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇళ్లపై మళ్లీ విచారణ చేసి అర్హులైన లబ్ధిదారులకు అందజేయాలని కోరారు. బీజేపీ నాయకులు చీదరి సాయిలు, కోనాల గంగారెడ్డి, శ్రీనివాస్, శంకర్‌గౌడ్, తదితరులున్నారు.

నేర నియంత్రణకు కృషి చేయాలి


సదాశివనగర్ పోలీసులతో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): నేర నియంత్రణకు కృషి చేయాలని కామారెడ్డి జిల్లా ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం సదాశివనగర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాలపై ఆరా తీశారు. దొంగతనాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మండల పరిధిలోని చాలా గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోలేదని సీఐ తెలపగా వెంటనే ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీఐ రామన్, ఎస్సై రాజేశ్ పాల్గొన్నారు.

జంగమ సమాజానికి స్థలం కేటాయించండి


వినతిపత్రం అందజేస్తున్న సమాజ్ ప్రతినిధులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో జంగమ సమాజానికి ఎకరం స్థలం కేటాయించాలని జంగమ సమాజం జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే గంప గోవర్ధన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లాలో 50 వేల జంగమ కుటుంబాలు ఉన్నాయని గుర్తు చేశారు. జంగమ సమాజం ప్రతినిధులు వీరయ్య, భద్రప్ప, సంగప్ప, భద్రయ్య పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ డైరీ ఆవిష్కరణ

కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయులకు అవసరమైన సమగ్ర సమాచారంతో పీఆర్‌టీయూ డైరీని రూపొందించడం అభినందనీయమని ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. సోమవారం కామారెడ్డిలో డైరీని ఆయన ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పుల్గం దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వాగతతోరణ నిర్మాణ పనుల పరిశీలన

కామారెడ్డి రూరల్/కామారెడ్డి టౌన్: నర్సన్నపల్లి శివారులో ఏర్పాటు చేస్తున్న స్వాగత తోరణ నిర్మాణ పనులను సోమవారం గంప గోవర్ధన్, బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. స్వాగత తోరణ పనులను వేగిరం చేయాలని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


రాంపూర్‌లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పిట్లం(జుక్కల్): ప్రజలు, వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని హెడ్ కానిస్టేబుల్ సాయాగౌడ్ పేర్కొన్నారు. ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని రాంపూర్ గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద ట్రాఫిక్ నియమ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది మొయిన్, ఓంకార్, కాశగౌడ్ పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనకు తోడ్పడండి


బీబీపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

బీబీపేట: జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో స్పర్శ కుష్టు వ్యాధి నిర్మూలన వాగ్దానం చేశారు. ఈ సందర్భంగా కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు తోడ్పడాలని ఆరోగ్య సిబ్బంది పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది హరిప్రసాద్, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాచారం..

■ నేడు ఇసుక వేలం పాట

బిచ్కుంద(జుక్కల్): అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుకున్న 3 బొలెరో వాహనాలలో ఉన్న ఇసుకకు మంగళవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవికాంత్ తెలిపారు. ఉదయం 11 గంటలకు బిచ్కుంద పోలీస్‌స్టేషన్‌లో వేలం ఉంటుందన్నారు.

■ బంజరలో కంటివెలుగు ప్రారంభం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బంజరలో మంగళవారం కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు స్థానిక సర్పంచ్ మాలావత్ అరుణ తెలిపారు. మూడు రోజుల పాటు కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు.

రజక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న రజక రిజర్వేషన్ సమితి నేతలు

మాచారెడ్డి: తెలంగాణలో రూ.వెయ్యి కోట్లతో రజక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షుడు జువ్వాడి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మాచారెడ్డిలో ఆయన మాట్లాడారు. తెలంగాణ బీఆర్ఎస్ ప్రభుత్వం పలు బడ్జెట్లలో రజకులకు ఒకసారి రూ.250 కోట్లు, మరోసారి రూ.200 కోట్లు ప్రవేశ పెట్టినప్పటికీ అవి కాగితాలకే పరిమితమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోవు బడ్జెట్ సమావేశాలలోపు గత బడ్జెట్లో కేటాయించిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, జిల్లా నాయకులు ఉన్నారు.

సంక్షిప్తం

పార్కు పనుల పరిశీలన

బాన్సువాడ టౌన్: పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న పార్కును మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ పరిశీలించారు. ఆయన వెంట కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు శ్రీనివాస్, అమేర్, నార్ల ఉదయ్, కిరణ్ ఉన్నారు.

కాటేపల్లితండాలో నర్సరీ..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): కాటేపల్లి తండాలో సోమవారం ఎంపీడీవో రాణి నర్సరీని పరిశీలించారు. ఆమె వెంట ఎంపీవో సూర్యకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న చెరుకు క్రషింగ్

సదాశివ నగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్ ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ జోరందుకుంది. ఆదివారం నాటికి 2 లక్షల 75వేల 689 టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు.

పంట సాగు వివరాల నమోదు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మల్లయ్యపల్లిలో పంట సాగు వివరాల నమోదును ఏఈవో రవీందర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య ఉన్నారు.

తరగతి గదుల నిర్మాణ పనులకు భూమిపూజ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): అన్నాసాగర్‌లో తరగతి గదుల నిర్మాణ పనులకు సర్పంచ్ నాగరాజు సోమవారం భూమిపూజ చేశారు. మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.28 లక్షలు మంజూరు కావడంతో 2 గదుల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని మూడవ వార్డులో సోమవారం డ్రైనేజీ పనులను సర్పంచ్ బొల్లు లావణ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ గరీబున్నిసాబేగం, ఉపసర్పంచ్ కొడరవి, మండల పార్టీ అధ్యక్షుడు రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

టీజేఎస్ దీక్షలో జిల్లా నాయకులు

కామారెడ్డి టౌన్: టీజేఎస్ ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహిస్తున్న దీక్షలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎల్లారెడ్డి ఇన్‌చార్జి నిజ్జన రమేష్, జిల్లా కన్వీనర్ లక్ష్మణ్ యాదవ్, నాయకులు రాణి, అల్లూరి, గోపాల్, సురేష్, విజయ్ ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నిజాంసాగర్(జుక్కల్): బస్వాపూర్‌కు చెందిన గంగవ్వకు సోమవారం సీఎంఆర్ఎఫ్ రూ.13000 చెక్కును, ఎంపీపీ యశోదనీలుపాటిల్ అందజేశారు. గ్రామ సర్పంచ్ రవి పటేల్ పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కులు..

నిజాంసాగర్(జుక్కల్): గాలిపూర్‌లో లబ్ధిదారులకు స్థానిక సర్పంచ్ లక్ష్మారెడ్డి కల్యాణ లక్ష్మి చెక్కులను అందించారు. ఉపసర్పంచ్ రాములు, ఎస్ఎంసీ చైర్మన్ గంగారాం, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు సాయిలు పాల్గొన్నారు.

వరి పండించే రైతులకు నీటి గొట్టాలు..

కామారెడ్డి రూరల్: కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్, పద్మపాని సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం శాబ్దిపూర్‌లోని వరి రైతులకు వరిలో తడి, పొడి సాగులో నీటి పొదుపుగా వాడటానికి ఉపయోగించే నీటి గొట్టాలను పంపిణీ చేశారు. సర్పంచ్ పస్తం యాదమ్మ, ఉపసర్పంచ్ నాగరాజు, పద్మపాని స్వచ్ఛంద సంస్థ క్లస్టర్ కో-ఆర్డినేటర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.